సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 6 । జనవరి । 2025



దండిగా కవ్వళ్లు..

విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు ఆదివారం కవ్వళ్లు దండిగా చేరాయి. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు అధిక సంఖ్యలో ఈ చేపలు చిక్కాయి. ఈ చేపలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క వేటలో ఎక్కువ చేపలు చిక్కడంతో మత్స్యకారుడు సత్తిబాబు సంతోషం వ్యక్తం చేశారు. - మహారాణిపేట

● ట్రంప్.. మోదీ.. మిల్లెట్ చిత్రం



చిరుధాన్యాలతో ప్రధాన మంత్రి మోదీ నిలువెత్తు చిత్రపటాన్ని, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా తీర్చిదిద్దారు నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్. బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియంలో వీటిని ప్రదర్శనకు ఉంచారు.

8లో

ఉలవ చేలో విదేశీయులు!

భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీకి చెందిన ఓ రైతు తన పంటను రక్షించుకునేందుకు వినూత్న పద్ధతిని అవలంబించాడు. బొమ్మలకు దుస్తులు తొడిగి, చేతిలో కర్రలు పెట్టి.. మనుషులను పోలి ఉండేలా సిద్ధం చేశాడు. కొబ్బరితోటలో ఉలవచేనుకు రక్షణగా వీటిని కాపాలా పెట్టాడు. అటువైపు వెళ్లే వారు వీటిని చూస్తూ.. ఉలవ చేనులో విదేశీయులేంటని ఆశ్చర్యపోతున్నారు. దీని వల్ల పక్షులు, జంతువులు ఇటువైపు రావడం లేదని రైతు తెలిపాడు. అయితే కొత్తగా వచ్చే వారు చీకట్లో ఈ బొమ్మలను చూసి భయపడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

- తగరపువలస





స్పందించారు.. గౌరవించారు

సాక్షి ఎఫెక్ట్..

'సాక్షి' కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. మసక బారిన మువ్వన్నెల త్రివర్ణ పతాకాన్ని తొలగించి.. కొత్త జెండాను ఎగురవేశారు. 'కాలుష్య కోరల్లో త్రివర్ణం.. రైల్వే నిర్లక్ష్యానికి నిదర్శనం' అనే శీర్షికతో ఈ నెల 3న 'సాక్షి' కథనం ప్రచురించింది. విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఎగురవేసిన జాతీయ జెండా కాలుష్యం కారణంగా నల్లగా మారుతోందని, రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంది. ఈ కథనానికి స్పందించిన రైల్వే అధికారులు పాత జెండాను తొలగించి, కొత్త త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇప్పుడు ఈ పతాకం విద్యుత్ వెలుగుల్లో ప్రకాశిస్తోంది.

- డాబాగార్డెన్స్

ఆకాశమే హద్దురా..

డిసెంబర్‌లోనూ వృద్ధి సాధించిన విశాఖ ఎయిర్‌పోర్టు





డిసెంబర్‌లో ప్రయాణికులు, విమాన సర్వీసుల రాకపోకలు

దేశీయ ప్రయాణికుల రాకపోకలు		అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	213711	2023 డిసెంబర్‌లో	5600
2024 డిసెంబర్‌లో	263705	2024 డిసెంబర్‌లో	12042
వృద్ధి రేటు	23,39 శాతం	వృద్ధి రేటు	115.04 శాతం

దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు		అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	1546	2023 డిసెంబర్‌లో	38
2024 డిసెంబర్‌లో	1874	2024 డిసెంబర్‌లో	82
పెరిగిన సర్వీసులు	328	పెరిగిన సర్వీసులు	44
వృద్ధి రేటు	21.22 శాతం	వృద్ధి రేటు	115.79 శాతం

- 2023 డిసెంబర్‌తో పోలిస్తే 23 శాతం పెరిగిన స్వదేశీ ప్రయాణికులు
- డొమెస్టిక్ విమాన సర్వీసుల్లో 21.22 శాతం వృద్ధి
- విదేశీ ప్రయాణికులు, సర్వీసులు ఏకంగా 115 శాతం పెరుగుదల

సాక్షి, విశాఖపట్నం : శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది. విశాఖ నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య ఊపందుకుంది. 2023 డిసెంబర్‌తో పోలిస్తే.. 2024 డిసెంబర్ నెలలో దేశ, విదేశీ ప్రయాణికుల రాకపోకలతో పాటు విమాన సర్వీసుల్లోనూ గణనీయంగా వృద్ధి సాధించింది.

వింటర్ సర్వీసులు పెరగడంతో..

చలికాలం అంటేనే పర్యాటకులకు పండగ. అందుకే విభిన్న మార్గాల్లో విమానయానాన్ని అందుబాటులోకి తీసుకొస్తూ.. ఆయా సంస్థలు తమ సర్వీసులను పెంచాయి. 2023 శీతాకాలంలో 32 సర్వీసులు ఇక్కడ నుంచి నడవగా.. ఈ ఏడాది 3 సర్వీసులు అదనంగా పెరిగాయి. మొత్తం 35 విమానాలు విశాఖ నుంచి శీతాకాలంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, జైపూర్, పోర్ట్‌బ్లెయిర్, కర్నూలు, కోల్‌కతా, తిరుపతి, ముంబై తదితర నగరాలకు రాకపోకలు జరుగుతున్నాయి. ఇందులో కొన్ని రోజువారి సర్వీసులుండగా.. మరికొన్ని వారంలో మూడు రోజుల పాటు నడుస్తున్నాయి. వీటితో పాటుగా ఇంటర్నేషనల్ సర్వీసులు కూడా అదరగొడుతున్నాయి. 2023 శీతాకాలంలో విదేశాలకు ఒకే ఒక్క సర్వీసు సింగపూర్‌కు మాత్రమే ఉండేది. ఇప్పుడు మలేషియా(కౌలాలంపూర్), బ్యాంకాక్‌కు ఇంటర్నేషనల్ సర్వీసుల పెరగడం.. ఈ సర్వీసులు కూడా కళకళలాడుతుండటం కలిసొచ్చిన అంశం. ఈ వృద్ధి ఇదే తరహాలో కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

డిసెంబర్‌లో అదరగొట్టింది

డిసెంబర్ నెలలో విశాఖ ఎయిర్‌పోర్టు అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసుల పరంగా విశాఖ ఎయిర్‌పోర్టు మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2023 డిసెంబర్‌తో పోలిస్తే ఈ సారి 23.39 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. డొమెస్టిక్ విమాన సర్వీసుల్లోనూ 21.22 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక అంతర్జాతీయ పాసింజర్ల విషయంలోనూ అదే జోరు కొనసాగింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో ఏకంగా 115.04 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లోనూ 115.79 శాతం వృద్ధి నమోదైంది. గతంతో పోలిస్తే అదనంగా సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.



రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

దివ్యాంగుల పింఛన్లపై కత్తి

- నేటి నుంచి దివ్యాంగులకు నోటీసులు
- 10 నుంచి వైద్య బృందాల తనిఖీ



మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే సామాజిక పింఛన్లపై ర్యాండమ్ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. మంచానికే పరిమితమైన దివ్యాంగులకు సోమవారం నుంచి నోటీసులు జారీ చేయనుంది. ఆ తర్వాత అధికారులు వారి ఇళ్లకు వెళ్లి సదరం సర్టిఫికెట్లను తనిఖీ చేస్తారు. అలాగే వైద్యుల బృందం దివ్యాంగులను మరోసారి పరీక్షించనుంది. ఈ నెల 8న విశాఖలో ప్రధానమంత్రి పర్యటన ఉండటంతో, ఈ కార్యక్రమం 10వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.

సదరం ధ్రువీకరణ పత్రాల ద్వారా జిల్లాలో 319 మంది నెలకు రూ.15వేల చొప్పున పింఛన్ పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన క్షతగాత్రులు, మానసిక వ్యాధులతో మంచం పట్టిన బాధితులు కూడా ఇందులో ఉన్నారు. వీరు కాకుండా డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు నెలకు రూ.10 వేలు పొందుతున్నారు. ఇతర కేటగిరీల్లోని దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున పింఛను అందిస్తున్నారు. కాగా.. నెలకు రూ.15 వేల పింఛను పొందుతున్న వారికి సోమవారం నుంచి నోటీసులు జారీ చేస్తారు. డీఆర్‌డీఏ జారీ చేసిన నోటీసులను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అందజేస్తారు. ఈ నెల 10 నుంచి వైద్య బృందాలు వారి ఇళ్లను సందర్శిస్తాయి. ఈ నెల 20, 22, 24 తేదీల్లో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. రోజుకు 45 మంది ఇళ్లను సందర్శించడానికి మూడు బృందాలను నియమించారు. ఒక్కో బృందం రోజుకు 15 మందిని పరీక్షిస్తుంది. ఈ బృందాల్లో ఆర్థోపెడిక్ వైద్యులు, ఫిజీషియన్లు, ఇతర స్పెషలిస్టులు ఉంటారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ కార్యదర్శులు కూడా ఈ ప్రక్రియలో పాల్గొంటారు. అనర్హులుంటే వారి వివరాలను వైద్య అధికారులు యాప్‌లో నమోదు చేస్తారు.

టీడీపీ సబ్బవరం మండలాధ్యక్షుడు రాజీనామా

- పీఏసీఎస్ ఛైర్మన్ పదవి కాదనడంతో మహాలక్ష్మినాయుడు నిర్ణయం!
- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీరుపై నిరసన

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ నిర్ణయాలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు బహిరంగంగానే అసంతృప్తి వెల్లగక్కుతున్నారు. ఆదివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ సమక్షంలో పార్టీ సబ్బవరం మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు పదవికి రాజీనామా చేశారు. త్వరలో ఏర్పాటు కానున్న పీఏసీఎస్ ఛైర్మన్ పదవికి తన పేరు ప్రతిపాదించలేదన్న కారణంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సబ్బవరం పీఏసీఎస్ ఛైర్మన్ పదవిని మిడతాడ ఆశించారు. అయితే బండారు వర్గీయుడు అయిన మహాలక్ష్మినాయుడుకి చుక్కెదురైంది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. పార్టీ మండలాధ్యక్ష పదవికి రాజీనామా చేసినా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీలో కొనసాగుతానని ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడు పేర్కొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రధాని మోదీ 8న విశాఖ పర్యటన నేపథ్యంలో అధికారులంతా ఏర్పాట్లలో ఉంటారని పేర్కొన్నారు.

జీవీఎంసీలో కూడా..

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చర్యల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు.

భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జాబ్ మేళా రేపు

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7న భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మేళాలో హిప్పోక్లాడ్ టెక్నాలజీస్, జయభేరి ఆటోమోటివ్స్, కేల్ గ్రూప్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ (డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్), డిప్లమో (ఆటోమొబైల్), ఎంబీఏ, బీటెక్, ఏదైనా డిగ్రీ చదివిన యువతీయువకులు ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 90147 58949లో సంప్రదించవచ్చు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో హాజరు కావాలని ఆయన సూచించారు.

ప్రధాని పర్యటన విజయవంతానికి కమిటీలు

మహారాణిపేట : ఈనెల 8వ తేదీన ప్రధాని విశాఖ పర్యటన విజయవంతానికి కమిటీలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి నారా లోకేష్ అన్నారు. రోడ్ షో బాధ్యతను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చూసుకుంటారని పేర్కొన్నారు. వారికి అంతా సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి ఇక్కడ ఏర్పాట్లపై వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామని, వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్‌తోపాటు ప్రజల వాహనాలకు 26 ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, మంత్రులు వంగలపూడి అనిత, బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, విప్‌లు గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పరిశీలించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సభా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.



ఏయూ మైదానంలో చురుగ్గా సభా ఏర్పాట్లు

జీవీఎంసీని సందర్శించిన కోర్బా మేయర్, కార్పొరేటర్లు



జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో కోర్బా నగర మేయర్ రాజా కిషోర్ ప్రసాద్, ఛైర్‌పర్సన్ శ్యామ్ సుందర్‌సోనితో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు, నగర సుందరీకరణ నిర్వహణ ఆకట్టుకున్నాయని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా నగర మేయర్ రాజా కిషోర్ ప్రసాద్, ఛైర్‌పర్సన్ శ్యామ్ సుందర్ సోని, 20 మంది కౌన్సిల్ సభ్యులు తెలిపారు. నగరాల అధ్యయన యాత్రలో భాగంగా కోర్బా నగర పాలక సంస్థ మేయర్, ఛైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు ఆదివారం విశాఖ విచ్చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నేతృత్వంలో వీరందరూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరాన్ని సందర్శించారు. విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ ఆకట్టుకుందని, రోడ్ల అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, పారిశుధ్య కార్మికుల విధి విధానాలు, నైట్ శానిటేషన్, భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల సహకారం తదితర జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని కోర్బా నగర మేయర్, ఛైర్‌పర్సన్ తెలిపారు. కోర్బా నగర మేయర్‌కు డిప్యూటీ మేయర్ శ్రీధర్, జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ జ్ఞాపిక అందజేశారు.

బిల్లు.. గుబేల్

కొత్త ఏడాదిలోనూ విద్యుత్ షాక్

చలికాలంలోనూ బిల్లుల మోత



తగరపువలస: నూతన సంవత్సరంలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ షాక్ ఇచ్చింది. ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు ఒక్క రూపాయి కూడా పెంచనని, అవసరమైతే తగ్గిస్తానంటూ ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు ప్రజలపై ఎడాపెడా భారం మోపుతున్నారు. ఒకవైపు చలికి వణుకుతూ ఫ్యాన్లు, ఏసీలు వినియోగించకపోయినా, కూటమి ప్రభుత్వం వేస్తున్న బిల్లులు చూసి ప్రజలు వణికిపోతున్నారు. ఫ్యూయెల్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) పేరుతో గతేడాది నవంబర్‌లో ఒకసారి, డిసెంబర్‌లో రెండుసార్లు విధించగా.. ఇప్పుడు జనవరిలో మూడు సార్లు చార్జీలు విధిస్తున్నారు. ఈ చార్జీలు వినియోగించిన యూనిట్ **చార్జీల** కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఇవే కాకుండా ఫిక్స్‌డ్, కస్టమర్, ఈడీ చార్జీల పేరుతో ఒక్కో వినియోగదారుడిపై యూనిట్ శ్లాబులను బట్టి రూ.35 నుంచి రూ.65 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా బిల్లుల్లో వినియోగదారులకు సబ్సిడీ ఇస్తున్నట్లు చూపిస్తున్నా, ఆ మొత్తాన్ని వారికి తెలియకుండానే వినియోగించిన యూనిట్ చార్జీలకు కలిపి వసూలు చేస్తున్నారు. దీంతో తాము వాడిన కరెంట్ కంటే ఎక్కువ మొత్తం వస్తోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని చార్జీలు కలుపుకుని యూనిట్ రేటు కనీసం రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.50 వరకు ఉంటుందని చెబుతున్నారు.



రూ.230 వరకు భారం పడింది

గత నెలలో 69 యూనిట్ల వినియోగానికి రూ.402 బిల్లు వచ్చింది. అదనపు చార్జీలు అన్నీ కలిపి రూ.230 వరకు పడ్డాయి. ఇలా బిల్లులు వస్తూ ఉంటే భరించడం ఎవరి తరమూ కాదు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి.

– పాశల శివ, కొత్తపేట






34 యూనిట్లకు రూ.230 బిల్లు

గత నెల రోజుల్లో 34 యూనిట్లు విద్యుత్ వినియోగించగా బిల్లు రూ.230 వచ్చింది. ఇందులో విద్యుత్ వినియోగానికి శ్లాబు ప్రకారం కేవలం రూ.68 కాగా స్థిర, కస్టమర్, సర్ చార్జీలతో పాటు విద్యుత్ కొనుగోలు అడ్జెస్ట్‌మెంట్ పేరుతో మూడుసార్లు వడ్డించారు. ఈ మొత్తం రూ.168 అయింది. అంటే వినియోగించిన విద్యుత్‌కు రెండు రెట్లు అధనంగా బిల్లు వచ్చింది.

– జీరు సత్యారావు, చిట్టివలస







5 యూనిట్లకు రూ.220 బిల్లు

మాకు ఉన్న ఒక మీటరుకు సంబంధించి 5 యూనిట్లకు రూ.220, మరో మీటరులో 19 యూనిట్లకు రూ.280 బిల్లులు వచ్చాయి. విద్యుత్ కొనుగోలు సర్దుబాటు పేరుతో మూడుసార్లు 5 యూనిట్ల బిల్లుకు రూ.176, 19 యూనిట్ల బిల్లుకు రూ.208 భారం పడింది. ఇలాగైతే చాలామంది మీటర్లు స్వచ్ఛందంగా తొలగించుకోవాల్సి వస్తుంది.

– కుంచం రమణ, తగరపువలస

అడ్డగోలు వ్యవహారాల్లో అప్పన్న ఉద్యోగులు

- మూడు నెలల కాలంలో ముగ్గురు సస్పెండ్
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



సింహాచలం: రాష్ట్రంలోని ప్రధాన దేవస్థానాల్లో ఒకటిగా ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగుల్లో అంకితభావం కొరవడుతోంది. దేవస్థానంలో ఉద్యోగం రావడమంటేనే భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాలి. దాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. నిత్యం భక్తుల సేవలో నిమగ్నమవ్వాలి. కానీ కొందరు ఉద్యోగుల పనితీరుతో దేవస్థానం అప్రతిష్ట మూటకట్టుకుంటోంది. రూ.వేలల్లో జీతాలు తీసుకుంటున్నా.. కాసులకు కక్కుర్తిపడి అడ్డదారిలో కొందరు వెళ్తుంటే, ఆధిపత్య పోరుతో మరికొంతమంది తమ బాధ్యతలు మరిచి వ్యవహరిస్తున్నారు. చేసిన తప్పులు రుజువయ్యాక సస్పెండ్ అవుతున్నారు. ఇటీవల దేవస్థానంలో పలువురు పర్మినెంట్ ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. దీంతో దేవస్థానం ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని భక్తులు చెప్పుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

దేవస్థానంలో సుమారు 250 మంది వరకు పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది వరకు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. గడచిన మూడు నెలల కాలంలో ముగ్గురు శాశ్వతోద్యోగులు సస్పెండ్ అయ్యారు. దేవస్థానం గదులను పెళ్లిళ్లు, శుభకార్యాలకు అద్దెకిస్తూ ఉపాలయం అర్చకుడు, ప్రసాదాల సెక్షన్‌లో నెయ్యి డబ్బాలు దొంగిలిస్తూ ఓ జూనియర్ అసిస్టెంట్, అంతరాలయ దర్శనం పేరిట భక్తుల నుంచి డబ్బులు తీసుకుని శానిటేషన్ విభాగ 4వ తరగతి ఉద్యోగి పట్టుబడ్డారు. విచారణలో దోషులుగా తేలి, సస్పెండ్ అయ్యారు. వీరింతగా బరితెగించడానికి ఉన్నతాధికారుల నిర్లిప్త వైఖరే కారణమన్న ఆరోపణలున్నాయి.

వైదికుల్లో ఆధిపత్య పోరు

ఇక భగవంతుడికి భక్తుడికి మధ్య అనుసంధానంగా నిలవాల్సిన దేవస్థానం వైదికుల్లో ఎప్పటి నుంచో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. తెల్లవారుజామున జరిగే సుప్రభాతసేవ నుంచి రాత్రి పవళింపు సేవ వరకూ వైదికుల్లో చాలాసార్లు ఆధిపత్య పోరు బయటపడింది. దీనిపై వైదికులు రచ్చకెక్కడంతో అప్పటి దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ సమావేశం ఏర్పాటుచేసి స్వయంగా వారిని హెచ్చరించారు. వైదికుల సహకారం లేకుండా ఈవోలు ఏమీ చేయలేరని గత ఈవో శ్రీనివాసమూర్తి కూడా తన అసహనాన్ని వ్యక్తం చేశారు. అయినా వీరిలో ఇప్పటికీ మార్పురాని పరిస్థితి. ఉద్యోగుల కారణంగా ఆలయ ప్రతిష్ట మంటగలుస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ పరిధిలోకి డీజిల్ తేవాలి

- కేంద్ర ప్రభుత్వానికి హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న బీపీఎల్ ట్రాన్స్‌పోర్ట్ ఎండీ రాజేష్

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం అభివృద్ధికి కీలకమైన సహకారం అందిస్తున్న హెవీ క్రేన్ యజమానులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని విశాఖపట్నం హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్(బీపీఎల్ ట్రాన్స్‌పోర్ట్ ఎండీ) రాజేష్ తెలిపారు. ఆటోనగర్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం అసోసియేషన్ వార్షిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రేన్ వ్యాపారులు, యజమానులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రేన్‌లపై జీవిత పన్ను మినహాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలన్నారు. క్రేన్‌లకు వాడే డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. దీని వల్ల పన్ను విధానంలో స్థిరత్వం ఏర్పడుతుందని, క్రేన్ యజమానుల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. క్రేన్ వ్యాపారాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలని, మల్టీ సెక్టార్ కంపెనీల నుంచి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, బ్యాంకులు భారీ క్రేన్ల రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు(బాలాజీ క్రేన్స్) లీలా రాఘవరావు, కార్యదర్శి వెంకుమహంతి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం(నాని), కోశాధికారి కోటేశ్వరరావు, సలహాదారు శంకర్ నారాయణ్, ప్రతినిధులు ఆర్ఆర్ఆర్ రాజు, శివ, పి.రమేష్, ఎల్.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

గోల్ఫ్ ఓవరాల్ చాంప్ తాపస్

విశాఖ స్పోర్ట్స్: ది వైజాగపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ కప్‌లో ఓవరాల్ విన్నర్‌గా తాపస్ మండల్ నిలిచారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌కోర్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 180 మంది గోల్ఫర్లు తలపడ్డారు. గోల్డ్ డివిజన్ విజేతగా మాథ్యూథామస్ నిలవగా రన్నరప్‌గా ఎం.కృష్ణారావు నిలిచారు. సిల్వర్ డివిజన్ విన్నర్‌గా అమర్‌కాంత్ నిలవగా రన్నరప్‌గా ఎం.వి.ఆర్.మూర్తి నిలిచారు. బ్రాంజ్ డివిజన్ విన్నర్‌గా విజయరామరాజు నిలవగా రన్నరప్‌గా వాసుదేవరాజు, ఆహ్వానితుల విన్నర్‌గా రాజేష్ పెంధార్కర్ నిలిచారు. మ్యాగ్జిమమ్ పార్స్‌ను రాజేష్ నాయర్ చేయగా.. మాగ్జిమమ్ బర్డీస్‌ను చంచల్‌గుప్తా చేసారు. లాంగెస్ట్ డ్రైవ్‌ను రాధాకృష్ణ, క్లోజెస్ట్ పిన్‌ను తులసీధర్ చేయగలిగారు. పోటీల ముగింపు కార్యక్రమానికి తూర్పునావికాదళ చీఫ్ కమాండర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ హాజరై విజేతలకు బహుమతులందించారు.

ఫిట్‌నెస్ గురు మ్యాన్‌రెడ్డి

పేద యువతకు వెలుగుబాట

యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ సాధనలో సహకారం


గెలుపు పొందే వరకు అలుపు లేదు మనకు..


హర్డిల్స్ వద్ద వ్యాయామం చేస్తున్న యువత


లాంగ్ జంప్ ప్రాక్టీస్

తగరపువలస: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం వ్యాయామం చేయాలి, పౌష్టికాహారం తీసుకోవాలి. వ్యాయామశాలలకు వెళ్లాలంటే కాస్త ఖర్చు చేయాలి. అలా వెళ్లలేని వారికి ఉచితంగా ఫిజికల్ ఫిట్‌నెస్‌లో శిక్షణ ఇస్తున్నారు చిట్టివలసకు చెందిన విశ్రాంత సుబేదార్ మట్టా అప్పలనరసయ్యరెడ్డి అలియాస్ మ్యాన్‌రెడ్డి. ఆయన స్వస్థలం విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గూడెపువలస. 28 ఏళ్ల సర్వీస్ అనంతరం 2014లో చిట్టివలసలో స్థిరపడ్డారు. స్వతహాగా అథ్లెట్ అయిన మ్యాన్‌రెడ్డి, తన లాగే మిగిలిన వారినీ ఆరోగ్యంగా ఉంచాలనే తపన పడేవారు. మొదట్లో ఊబకాయం, బరువు తగ్గించుకోవాలనుకునేవారు వేకువజామునే ఆయన ఇచ్చే కఠోర శిక్షణ కోసం ఎదురుచూసేవారు. క్రమంగా పారా మిలటరీ, ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూసే అభ్యర్థులు, హోంగార్డులు ప్రస్తుతం ఆయన ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. శారీరక ఫిట్‌నెస్‌తో పాటు, వైద్యపరంగా అభ్యర్థులకు అవసరమైన మెలకువలను వైద్యుల సహాయంతో అందిస్తున్నారు. ఇందుకు అభ్యర్థుల నుంచి ఒక్క పైసా కూడా వసూలు చేయడం లేదు. పైగా తన పెన్షన్ నుంచే ఖర్చు చేయడం విశేషం. ఇప్పటివరకు ఆయన శిక్షణలో 50 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, ప్రస్తుతం 50 మంది శిక్షణ పొందుతున్నారు. మొదట్లో సంగివలస, రాయపాలెం ప్రైవేట్ లేఅవుట్‌లు, కేథరిన్, భీమిలి పుడా మినీ స్టేడియం, భీమిలి బీచ్‌లో శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉండే విధంగా నమ్మివానిపేటలోని ప్రైవేట్ స్థలంలో ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

సొంత డబ్బులతో కావాల్సిన పరికరాలు

జాతీయ స్థాయిలో రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మ్యాన్‌రెడ్డి నమ్మివానిపేట గ్రౌండ్‌లో చుట్టూ 400 మీటర్లతో వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. వ్యాయామానికి అవసరమైన హర్డిల్స్, పాత టైర్లు, మ్యాట్‌లు, సముద్రపు ఇసుక వినియోగిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల నియంత్రణకు కూడా నిత్యం శిక్షణ ఇస్తున్నారు. వర్కవుట్లు, 1.6 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్, ఏబీసీడీ ఎక్సర్‌సైజ్, హర్డిల్స్ వంటి వాటిలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా తన ఖర్చులతో పేద అభ్యర్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. జీవనశైలిలో కొద్దిపాటి మార్పులు చేసుకుంటూ.. ఒత్తిడికి దూరంగా ఉంటే ఆరోగ్యంతో పాటు యువత అనుకున్న ఉద్యోగాలు సాధించవచ్చని శిక్షణ ద్వారా మ్యాన్‌రెడ్డి నిరూపిస్తున్నారు.

యువత సిద్ధం



భవిష్యత్‌లో రానున్న పారామిలటరీ, ఆర్మీ, పోలీస్, నేవీ, హోంగార్డు తదితర నోటిఫికేషన్లకు ఆసక్తి కలిగిన యువతను సిద్ధం చేస్తున్నాను. పెద్దలు, మహిళల ఆసక్తి మేరకు బరువు, స్థూలకాయం తగ్గడానికి, మధుమేహం నియంత్రణకు వర్కవుట్లు చేయిస్తున్నాను.
– మట్టా అప్పలనరసయ్యరెడ్డి, విశ్రాంత సుబేదార్

తేలికగా ఉంటుంది



మ్యాన్‌రెడ్డి వద్ద శిక్షణ తీసుకుంటున్న నాటి నుంచి శరీరం, మనసు తేలికగా ఉంటుంది. ఒత్తిడి లేదు. నా వృత్తిని ప్రశాంతంగా చేసుకోగలుగుతున్నాను.
– నమ్మి సూరిబాబు, న్యాయవాది

ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా..



బీటెక్ చదువుతూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను. భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లలో నాకు అనువైన దాని కోసం ఫిజికల్ ఫిట్‌నెస్ అవసరం. అందుకే ఇక్కడ శిక్షణ ఎంచుకున్నాను.
– టి. నిఖిత, చెరకుపల్లి

ఏ నోటిఫికేషన్ అయినా సిద్ధంగా..



భవిష్యత్‌లో ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చినా ఎదుర్కోవడానికి చదువే కాకుండా ఫిజికల్ ఫిట్‌నెస్ కూడా అవసరమే. ఇందుకోసం గ్రౌండ్‌కు వస్తున్నాను. నాలాగే ఆసక్తి ఉన్న చాలా మంది యువతీయువకులు కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు.
– వినోద్‌బాబు, తగరపువలస

పోలీస్ సెలక్షన్‌కు సిద్ధమవుతున్నా..



నేను ఎమ్మెస్సీ పూర్తి చేశాను. పోలీస్ ఉద్యోగం సాధించడం నా కల. అందులో చేరాలని శిక్షణ తీసుకుంటున్నాను. మెలకువలతో పాటు ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్నారు. గ్రౌండ్‌లో వసతులు సమకూర్చారు.
– కొల్లేటి శ్రావణి, చిట్టివలస

ది ట్రంప్ స్టోరీ.. మేడ్ బై విజయ్

- చిరుధాన్యాలతో ట్రంప్ జీవిత ఘట్టాలు
- ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్


ప్రదర్శన ప్రారంభించి చిత్రాలను తిలకిస్తున్న ప్రభుకిశోర్


ట్రంప్ జీవిత ఘట్టాలు



ఏయూక్యాంపస్: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను చిరు ధాన్యాలు ఉపయోగించి చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ అద్భుత చిత్రాలు తీర్చిదిద్దారు. వీటితో బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియంలో మూడు రోజుల ప్రదర్శన ఏర్పాటు చేయగా.. ఆదివారం వరుణ్ గ్రూప్ చైర్మన్ వి.ప్రభుకిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుకిశోర్ మాట్లాడుతూ మిల్లెట్ ఆర్ట్‌తో విశాఖకు విజయ్ కుమార్ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని కొనియాడారు. కేవలం చిరుధాన్యాలు ఉపయోగించి సహజత్వం తొణికిసలాడే విధంగా చిత్రాలు నిలిచాయన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను చిత్రాలుగా మలిచినట్లు చెప్పారు. దాదాపు రెండు నెలల పాటు సమయం వెచ్చించి.. మూడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పుతో మొత్తం 13 చిత్రాలను రూపొందించినట్లు వివరించారు. వీటిని డోనాల్డ్ ట్రంప్‌కు బహుమతిగా పంపాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా.. మిల్లెట్లతో తీర్చిదిద్దిన మోదీ చిత్రం ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శనను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ సందర్శించారు.

మిషన్ వాత్సల్య పోస్టులకు దరఖాస్తులు

ఎంవీపీకాలనీ: జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ 01, డాక్టర్ (పార్ట్ టైం) 01, ఆయా 01 పోస్టు భర్తీ చేయనున్నారు. 25-42 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులు. అర్హత గల అభ్యర్థులు https://visakhapatnam.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 18వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గల జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో అందజేయాలి.

వైద్య బృందాలు సిద్ధం

మహారాణిపేట : ప్రధాని మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో వైద్య బృందాలను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. విశాఖ విమానాశ్రయం, ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం వద్ద వైద్య బృందాలు ఉంటాయన్నారు. అపోలో, కేర్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి, ఐఎస్ఎస్ కల్యాణి ఆస్పత్రులను కూడా సిద్ధం చేశామన్నారు. అపోలో ఆస్పత్రిలో పది పడకలు, కేజీహెచ్ ఐసీయూలో 20 పడకలు సిద్ధం చేశామని తెలిపారు.



సాక్షి,పాడేరు: మన్యానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. దీంతో సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వంజంగి హిల్స్‌లో సూర్యోదయం, పొగమంచు అందాలను వీక్షించారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు నుంచి వంజంగి హిల్స్‌కు కాలినడకన చేరుకున్నారు.

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి నెలకొంది. వాతావరణంలో మార్పులు కారణంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో పర్యాటకులు రద్దీ పెరిగింది. ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించారు. తాజంగి జలాశయానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. జిప్‌లైనర్, బోటు షికార్ చేస్తూ సందడి చేశారు.

డుంబ్రిగుడ: మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. చాపరాయి జల విహారి, అరకుపైనరీ సందర్శకులతో సందడి నెలకొంది. చాపరాయి జలవిహారిలో స్నానాలు చేస్తూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. అరకు పైనరీలో పైన్ వృక్షాల మధ్య ఫొటోలు దిగారు. వన భోజనాలు చేశారు.

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా తరలిరావడంతో సందడి నెలకొంది. ఇక్కడికి సమీపంలోని జోలాపుట్టు జలాశయం, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, దేసిమా మ్యూజియాన్ని సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి నెలకొంది.

క్వార్టర్స్ ఉండగా బయట నివాసం ఎందుకు?


గురుకులం ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన మంత్రి బాల శ్రీ వీరాంజనేయ స్వామి


శ్రీకృష్ణాపురం గురుకులం ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి డోలా

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులను పలకరించి, వసతి, భోజన సౌకర్యాలు గురించి అడిగారు. అనంతరం మరుగుదొడ్లు, వంటగదిని పరిశీలించారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, నీరు వృథాగా పోతుండటం గమనించి.. సిబ్బందిని మందలించారు. మంత్రి గురుకుల పాఠశాలను సందర్శించిన గంట తర్వాత ప్రిన్సిపాల్ రత్నవల్లి అక్కడికి చేరుకున్నారు. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులంలోనే క్వార్టర్స్ ఉండగా బయట ఎందుకు నివాసం ఉంటున్నారని ఆమెను ప్రశ్నించారు. సిబ్బంది అంతా క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, అపారిశుధ్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురుకులాల డీసీ ఎస్.రూపావతి, ఉపాధ్యాయుడు రమేష్ ఆయన వెంట ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఉత్తరాంధ్ర బీసీ గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం
- 15 గురుకులాల నుంచి 375 మంది క్రీడాకారుల హాజరు


పరుగుపందెం పోటీలో పాల్గొన్న విద్యార్థులు


స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ఈవో త్రినాథరావు, సీఐ గొలగాని అప్పారావు

సింహాచలం: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు, శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపకరిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జోనల్ స్థాయి(జోన్-1) స్పోర్ట్స్ మీట్ స్థానిక గురుకుల పాఠశాలలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ మీట్‌ని ఈవో త్రినాథరావు, సీఐ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 15 బీసీ గురుకులాల నుంచి 375 మంది విద్యార్థులు, వారి వెంట వ్యాయామ ఉపాధ్యాయులు వచ్చారు. రెండు రోజులపాటు వీరు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నట్లు సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిణి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు జరిగిన 800 మీటర్ల పరుగుపందెంలో అంబోలు పాఠశాలకి చెందిన సతీష్ తొలి స్థానంలో, సింహాచలం పాఠశాలకి చెందిన రాకేష్ ద్వితీయస్థానంలో, నర్సీపట్నం పాఠశాలకి చెందిన దేముడునాయుడు తృతీయస్థానంలోను నిలిచారు.

జమ్మూకశ్మీర్‌పై చండీగఢ్ విజయం

విశాఖ స్పోర్ట్స్ : విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ డి పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ ఏడు వికెట్ల తేడాతో జమ్మూకశ్మీర్‌పై విజయం సాధించింది. ఓపెనర్ల జోడీ సెంచరీలతో సహా తొలి వికెట్‌కు 237 పరుగుల భాగస్వామ్యంతో గట్టి పునాది వేసింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జమ్మూకశ్మీర్ కెప్టెన్ డోగ్రా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు మొగ్గుచూపాడు. దీంతో జేకే జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. అర్ధసెంచరీ చేసిన ఓపెనర్ శుభమ్ కజారియా(72) మరో ఓపెనర్ విశ్రాంత్(21)తో 56 పరుగులు, ముసైఫ్(20)తో కలిసి రెండో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. నాజిర్(28)-సాహిల్(22) జోడి ఆరో వికెట్‌కు 51 పరుగులు అందించగా, ముస్తాక్ (53), రషిక్ (21) జోడి అజేయంగా 67 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. నిషంక్ మూడు వికెట్లు తీయగా నిఖిల్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా చండీగఢ్ ఓపెనర్లు మనన్ వోరా(107) తుషార్ జోషి(131) తొలి వికెట్‌కు 237 పరుగులు జోడించారు. శివమ్ 27 పరుగులతో, కౌశిక్ 8 పరుగులు చేసి 42.5 ఓవర్లలోనే జట్టును విజయతీరానికి చేర్చారు. సునీల్ రెండు వికెట్లు తీశాడు. ఆదివారంతో లీగ్ దశ పోటీలు ముగిశాయి. గ్రూప్ డిలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ విదర్భ విజయం సాధించి 24 పాయింట్లతో నేరుగా నాకవుట్‌కు చేరింది. గ్రూప్ బిలో ఆడిన ఆంధ్ర నాలుగు విజయాలు మూడు పరాజయాలతో 16 పాయింట్లతో లీగ్ దశలోనే వెనుతిరిగింది.

క్రాస్‌కంట్రీ స్టేట్ చాంప్ విశాఖ


ఓవరాల్ చాంపియన్ సాధించిన విశాఖ అథ్లెట్లు


విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. ప్రవల్లిక, మేరీగ్రేస్, వేదవ్యాస్ ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచి జట్టుకు చాంపియన్‌షిప్ అందించారు. విశాఖ జిల్లా అథ్లెట్లు మొత్తంగా 24 పాయింట్లతో చాంపియన్‌షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. అండర్ 16 బాలికల రెండు కిలోమీటర్ల పరుగులో బి.ప్రవల్లిక విజేతగా నిలవగా.. అండర్ 18 బాలికల నాలుగు కిలోమీటర్ల పరుగులో రాగిణి, వుమెన్-20 ఆరు కిలోమీటర్ల పరుగులో హాసిని తృతీయ స్థానాల్లో నిలిచారు. వుమెన్-10 కిలోమీటర్ల పరుగులో ఎల్.మేరీగ్రేస్ తొలి స్థానంలో నిలవగా దివ్యదుర్గ ద్వితీయ, జ్యోతిదుర్గా తృతీయ స్థానాల్లో నిలిచారు. మెన్-10 కిలోమీటర్ల పరుగులో ఎం.ఎస్.జె.వేదవ్యాస్ తొలి స్థానంలో నిలవగా రమేష్ తృతీయ స్థానంలో నిలిచాడు. అండర్-20 మెన్ ఎనిమిది కిలోమీటర్ల పరుగులో చిన్నా తృతీయ స్థానంలో నిలిచాడు. వీరందరిని జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

గుండె పోటుతోనే ఆ విద్యార్థి మృతి


మృతుడు ఫణికుమార్ పిల్లి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక చట్టివాని పాలేనికి చెందిన ఫణికుమార్ పిల్లి(36) డిసెంబర్ 13న కెనడాలో గుండె పోటుతోనే మృతి చెందాడని, అందులో ఎలాంటి అనుమానాల్లేవని ఎన్నారై సంఘ సేవకురాలు రూపా రాజ్ తెలిపారు. ఆదివారం చట్టివానిపాలెంలో మృతుడి తండ్రి పిల్లి వరప్రసాద్, తల్లి గీతాబాయి, సోదరుడు పిల్లి నవ్యపవన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఫణికుమార్ మృతదేహం సోమవారం స్వగృహానికి చేరనుందన్నారు. ఫణికుమార్ కాల్గరీలోని సదరన్ అల్బెర్టా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సప్లై చైన్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయడానికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఫణికుమార్ చనిపోయినట్లు 14న అక్కడి నుంచి ఫణి రూమ్‌మేట్ ఫోన్ చేశారని రూపారాజ్ తెలిపారు. మృతదేహం తరలింపులో భారత రాయబార కార్యాలయంతో పాటు తానా(అమెరికా), కెనడా బృందం ఎంతో సాయపడ్డాయన్నారు.

ఓపీఎస్ అమలుకు కృషి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

గోపాలపట్నం: పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) అమలయ్యేలా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జిల్లాల పీఆర్‌టీయూ కార్యకర్తలు, ఉపాధ్యాయులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడతానన్నారు. కామన్ సర్వీస్ రూల్స్ తప్పనిసరిగా అమలయ్యేలా చూస్తానని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి సర్వీసులో ఒకటి రెండు పదోన్నతులు దక్కేలా చూస్తానన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు, కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల రెగ్యులరైజ్‌కు కృషి చేస్తానన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా జూనియర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, పాలిటెక్నిక్ కళాశాలల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, గిరి ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకులు ఏఎస్ నాయుడు, ఎ.సదాశివరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.